క్లుప్తంగా

నేడు ఎంపీ ఆధ్వర్యంలో ప్రజాదర్బార్

జమ్మలమడుగు : స్థానిక మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి కార్యాలయంలో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి మంగళవారం ఉదయం ఆరు గంటలకు ప్రజాదర్బార్ నిర్వహించడం జరుగుతుందని కార్యాలయ సిబ్బంది పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి పరిష్కారానికి కృషి చేస్తారని తెలిపారు. సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, మండల కన్వీనర్లు, కౌన్సిలర్లు హాజరు కావాలని కోరారు.

పరామర్శ

పులివెందుల రూరల్ : పులివెందుల పట్టణంలోని ఎర్రగుడిపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ కార్యకర్త సూర్యనారాయణ (సూరి) వారం రోజుల క్రితం హైదరాబాద్‌కు బస్సులో వెళుతుండగా ఇనుప చువ్వలు తగిలి కాలికి తీవ్ర గాయమైంది. దీంతో ఆయన పులివెందులలోని కడప రోడ్డులో ఉన్న వైఎస్సార్ సర్వజన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి సోమవారం ఆసుపత్రికి వెళ్లి సూరి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయనకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా మండల పూజ



ఆంజనేయస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

తొండూరు : మండల పరిధి మడూరు గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఉన్న అభయాంజనేయ స్వామి ఆలయంలో సోమవారం దివంగత మిద్దె రామయ్య కుమారులు మిద్దె గంగులయ్య, మిద్దె నరసింహులు ఆధ్వర్యంలో మండల పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ఆంజనేయస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయంలో చిన్నారులచే కోలాట ప్రదర్శన, తాళాల భజన నిర్వహించారు. ఈ సందర్భంగా మిద్దె మురళి మాట్లాడుతూ గత నెల 7వ తేదీన శ్రీ అభయ ఆంజనేయస్వామి విగ్రహం ప్రతిష్ట చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మిద్దె రామయ్య కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

నివాళి



అబ్దుల్ ఖాదర్ మృతదేహానికి నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

పెండ్లిమర్రి : మండలంలోని నందిమండలం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు అబ్దుల్ ఖాదర్(90) అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం ఇంటి వద్ద మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ జిల్లా వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి అక్కడికి వెళ్లారు. మృతదేహానికి నివాళి అర్పించి బాధిత కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మాజీ ఎమ్మెల్యే వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు చావలి శివ, అమర్‌నాథ్‌రెడ్డి, రవి, సురేష్ ఉన్నారు.

గృహోపకరణాల వితరణ



దివ్యాంగుడికి ప్రెషర్ కుక్కర్‌ను అందిస్తున్న రవికుమార్, నాయకులు

పులివెందుల టౌన్ : పులివెందుల పట్టణంలోని ముద్దనూరు రోడ్డులో ఉన్న వికలాంగుల కమ్యూనిటీ భవనంలో సోమవారం సాయంత్రం దివ్యాంగులకు గృహోపకరణాలను అందించారు. అమ్మవారిశాల వీధికి చెందిన విజయ్ జ్యువెలర్స్ అధినేత దివంగత కొప్పరపు శివసుబ్రహ్మణ్యం నాలుగో వర్ధంతిని పురస్కరించుకుని ఆయన సతీమణి చంద్రావతి, కుమారుడు కొప్పరపు విజయ్ కుమార్‌లు ఏర్పాటు చేసిన సంస్మరణ కార్యక్రమానికి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కొత్త రవికుమార్ హాజరయ్యారు. శివసుబ్రహ్మణ్యం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం దివ్యాంగులకు ప్రెషర్ కుక్కర్లతోపాటు స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వికలాంగుల నెట్ వర్క్ రాష్ట్ర అధ్యక్షులు ఇరికిరెడ్డి రఘునాథరెడ్డి, కుటుంబ సభ్యులు కొప్పరపు చంద్రావతి, కొప్పరపు విజయ్ కుమార్, వికలాంగుల సంఘం కార్యదర్శి ఆర్ వెంకటసుబ్బయ్య, సునీల్, కార్యవర్గసభ్యులు గంగయ్య, బషీర్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రేపు విరాట పర్వ పఠనం

సింహాద్రిపురం : సింహాద్రిపురంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం పౌర్ణమి సందర్భంగా విరాట పర్వ పఠనం నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఐదుగురు భాగవత పండితులు ఉపవాసంతో చేస్తారని వారు పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించి, స్వామి వారి అనుగ్రహం పొందాలని వివరించారు.

కూటమి కక్ష వైఖరి వీడాలి



పులివెందుల మెడికల్ కళాశాలపైన కూటమి ప్రభుత్వం చూపుతున్న కక్షపూరిత వైఖరిని విరమించుకోవాలి. పులివెందులలోని మెడికల్ కళాశాల భవనాలను వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ ఒక్కసారి కూడా పరిశీలించకుండా.. అసత్య ఆరోపణలు చేయడం తగదు. పులివెందుల ప్రాంత విద్యార్థులు, ప్రజల జీవితాలతో చెలగాటమాడొద్దు. ఇది ప్రభుత్వానికి తగిన చర్య కాదని హెచ్చరిస్తున్నాం.

- వెంకట్రాముడు, సీపీఐ ఏరియా కార్యదర్శి, పులివెందుల



లేఖను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలి



ప్రభుత్వ వైద్యశాల వద్దంటూ చంద్రబాబు కేంద్రానికి లేఖ రాయడం కుట్రలో భాగమే. పేద ప్రజలకు వైద్య విద్యను దూరం చేయాలని ప్రభుత్వం చూస్తోంది. నూతన ప్రభుత్వ మెడికల్ కళాశాల వల్ల పేద విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుంది. విద్యార్థులకు ర్యాంక్‌లు తక్కువ వచ్చినా సీట్లు వచ్చాయి. అంతేకాక పులివెందుల ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యం అందించడానికే మెడికల్ కళాశాలను గత ప్రభుత్వం మంజూరు చేసింది.

- బ్రహ్మం, సీపీఐ ఏరియా సహాయ కార్యదర్శి, పులివెందుల

ప్రవక్త జీవితం.. శాంతి సందేశం





జమ్మలమడుగులో శాంతి కపోతాలు ఎగువేస్తున్న పీఠాధిపతి సయ్యద్‌షా గౌస్‌పీరాఖాద్రీ, కమలాపురంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

- ఘనంగా మిలాద్ ఉన్ నబీ వేడుకలు
- పీఠాధిపతులు సయ్యద్‌షా గౌస్‌పీరా ఖాద్రీ, సయ్యద్‌షా సాదిక్‌పాషా ఖాద్రీ

జమ్మలమడుగు : ప్రపంచ శాంతి కోసం జన్మించిన మహోన్నతుడు మహమ్మద్ ప్రవక్త అని ఆస్థానయే గౌసియా పీఠాధిపతి సయ్యద్‌షా గౌస్‌పీరాఖాద్రీ, కమాలియా జామియా మసీదు పీఠాధిపతి సయ్యద్ షా సాదిక్‌పాషా ఖాద్రీలు పేర్కొన్నారు. సోమవారం మహమ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా పట్టణంలో వేర్వేరుగా ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ముస్లిం శాంతి మార్గంలో పయనించాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను సన్మార్గంలో పెంచాలన్నారు. తమ పిల్లలు ఏమి చేస్తున్నారు, ఎక్కడ తిరుగుతున్నారు అనే విషయాలు గమనిస్తే వారు సరైన దారిలో నడుస్తారన్నారు. చిన్నప్పటి నుంచి వారిని నమాజ్ చదువుకునేందుకు మసీదులకు పంపించాలన్నారు. ఇంట్లో ఉన్న పెద్దల పట్ల గౌరవంగా చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సయ్యద్‌షా తాహీర్‌పీరాఖాద్రీ తదితరులు పాల్గొన్నారు.

మహమ్మద్ ప్రవక్త జ్ఞాపికల ప్రదర్శన

ఆస్తానయే గౌసియాలో మహమ్మద్ ప్రవక్త జ్ఞాపికలను పీఠాధిపతి సయ్యద్‌షా గౌస్‌పీరాఖాద్రీ ఆధ్వర్యంలో ప్రదర్శించారు. ఈ సందర్భంగా పట్టణంలోని అన్ని ప్రాంతాల నుంచి మహిళలు, పురుషులు మహమ్మద్ ప్రవక్త జ్ఞాపికలను చూసేందుకు భారీగా తరలివచ్చారు. అనంతరం సయ్యద్‌షా బడేగౌస్ పీరాఖాద్రీ దివ్య సమాధి వద్ద ప్రత్యేక ఫాతేహాలను నిర్వహించారు. జ్ఞాపికలను తిలకించిన భక్తులకు ప్రత్యేకం ప్రసాదాలను, స్వీట్స్ పంపిణీ చేశారు.

బైక్ ర్యాలీ

కమలాపురం : జష్న్-ఏ-మిలాద్‌ను పురస్కరించుకుని వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు ఇస్మాయిల్ ఆధ్వర్యంలో ముస్లిం యువత బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ఇస్మాయిల్ జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీ దర్గా నుంచి ప్రారంభమై క్రాస్ రోడ్డు వరకు, తిరిగి అక్కడి నుంచి గ్రామ చావడి వరకు, అక్కడి నుంచి దర్గా వరకు బైక్ ర్యాలీ నిర్వహించి ఒకరికొకరు మిలాదున్నబీ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు.

దూళితో అరటి తోటలకు తీవ్ర నష్టం

- పరిశీలించిన ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి



దెబ్బతిన్న అరటి తోటను పరిశీలిస్తున్న కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

వేముల : నేషనల్ గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణ పనులను చేపట్టిన డీబీఎల్ కంపెనీ వల్ల దుమ్ము, ధూళి వ్యాపించి అరటి తోటలు దెబ్బతింటున్నాయి. 30 ఎకరాలలో అరటి తోటలకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. నిర్మాణ పనుల కోసం బెస్తవారిపల్లె సమీపంలో డీబీఎల్ సంస్థ కంపెనీ ఏర్పాటు చేసుకుంది. ఈ కంపెనీలో ఏర్పాటు చేసిన క్రషర్, సిమెంటు మిక్సింగ్ ప్లాంటు, హాట్ మిక్సింగ్ ప్లాంటు వల్ల నిత్యం దుమ్ము, ధూళి వ్యాపించి అరటి తోటలపై పడుతోంది. వాటిలో ఉన్న రసాయన పదార్థాలతో అరటి తోటలు దెబ్బతింటున్నాయి. 'నాకున్న 30 ఎకరాలలో అరటి సాగు చేశా. రెండవ పంటగా అరటి సాగులో ఉంది. ప్రస్తుతం అరటి పంట గెలలు వేస్తోంది. దుమ్ము, ధూళి తోటలపై పడటంతో వేసిన గెలలు నాసిరకంగా ఉంటాయని ఆందోళన చెందుతున్నా. అలాగే 4 ఎకరాలలో చామంతి సాగులో ఉంది. చామంతి తోటపై దుమ్ము, ధూళి పడటంతో పంట దెబ్బతింటోంది. ప్రస్తుతం చామంతి పంట మొగ్గదశలో ఉంది. దుమ్ము, ధూళి సాగులో ఉన్న పంటలపై పడటంతో రూ.1.50 కోట్ల మేర నష్టపోతున్నాను' అని రైతు తుమ్మలూరు భాస్కర్‌రెడ్డి కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాడు. దీంతో ఎంపీ సోమవారం బెస్తవారిపల్లె సమీపంలో దెబ్బతిన్న అరటి పంటను పరిశీలించారు. తోటంతా కలియ తిరిగారు. కంపెనీ ప్రతినిధులతో మాట్లాడి న్యాయం చేస్తానని బాధిత రైతు భాస్కర్‌రెడ్డికి ఎంపీ భరోసా ఇచ్చారు. అలాగే పంట నష్టంపై ఆందోళన చెందవద్దని ఎంపీ ధైర్యం చెప్పాడు.

మాదక ద్రవ్యాలను నిర్మూలించాలి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ట్రాఫిక్ సీఐ, స్నేహిత అమృత హస్తం సేవా సమితి నాయకులు

పులివెందుల రూరల్ : పులివెందుల పట్టణంలోని ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ కార్యాలయంలో సోమవారం సాయంత్రం ట్రాఫిక్ సీఐ హాజీవల్లి స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజుతో కలిసి మాదవ ద్రవ్యాల నిర్మూలన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ మాట్లాడుతూ గతంలో డ్రగ్స్ సేవించే వారు చాలా అరుదుగా ఉండేవారని.. ప్రస్తుతం యువత ఎక్కువగా సేవివించడం చాలా విచారకరమన్నారు. డ్రగ్స్ తీసుకునే వారు ఎక్కువగా టీబీ, క్యాన్సర్, కిడ్నీ వ్యాధులు వంటి ప్రమాదకరమైన దీర్ఘకాలిక జబ్బులకు గురై మంచాన పడుతారన్నారన్నారు. ఈ డ్రగ్స్ మహమ్మారిని అరికట్టడంలో భాగంగా స్వచ్ఛంద సేవా సంస్థలు, అన్ని విద్యాసంస్థలు, ప్రభుత్వ, ప్రైవేట్ రంగ సంస్థలు ఈ నెల 18వ తేదీ నుంచి అవగాహన సదస్సులు కల్పించేందుకు శ్రీకారం చుట్టడం శుభ పరిణామమని కొనియాడారు. కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీసులు, నేత్ర సేకరణ కేంద్రం టెక్నీషియన్ హరీష్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మికులను ఆదుకోవాలి



కరపత్రాలు విడుదల చేస్తున్న చేతివృత్తుల ఐక్యవేదిక నాయకులు

వేంపల్లె : రాష్ట్రంలో చేనేత పరిశ్రమపై ఆధారపడి జీవనం సాగిస్తున్న మగ్గం నేసే కార్మికులను రాష్ట్ర ప్రభుత్వం నేతన్న నేస్తం ద్వారా రుణాలు ఇచ్చి ఆదుకోవాలని జాతీయ చేతివృత్తుల ఐక్యవేదిక పార్టీ జాతీయ అధ్యక్షులు అవ్వారు మల్లికార్జున డిమాండ్ చేశారు. సోమవారం వేంపల్లెలో చేతివృత్తుల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 30వ తేదీన రాష్ట్రంలో అన్ని జిల్లా కలెక్టరేట్ కార్యాలయాల ఎదుట జరిగే ధర్నాను విజయవంతం చేయాలన్నారు. జిల్లాలోని నలుమూలల ఉన్న చేతివృత్తుల కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. అనంతరం ధర్నాకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో చేతివృత్తుల జాతీయ నాయకులు గూడూరు రామచంద్ర, డాక్టర్ సుబ్రహ్మణ్యం, కమలాపురం అధ్యక్షులు రమణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వినాయక నిమజ్జనం



నందిమండలంలో లడ్డూ దక్కించుకున్న చంద్రశేఖర్

పెండ్లిమర్రి : వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా మండలంలోని నందిమండలం గ్రామంలో సోమవారం ఘనంగా గణనాథుని నిమజ్జనం వేడుకలు నిర్వహించారు. తొమ్మిది రోజుల పాటు భక్తులు ప్రత్యేక పూజలు చేసి వినాయకుడి విగ్రహాలను ట్రాక్టర్లలో గ్రామంలో ఊరేగింపు చేశారు. డప్పులు, మంగళవాయిద్యాల మధ్య బాణసంచా కాల్చుతు చిన్నారులు, యువత నృత్యాలు చేశారు. రంగులు చల్లుకుంటూ, ఆట పాటలతో సమీపంలో ఉన్న కాల్వలోకి తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. ఈ గ్రామంలోని చౌడమ్మ వీధిలో గ్రామ కమిటీ ఆధ్వర్యంలో లడ్డూ వేలం పాట నిర్వహించారు. పంగా చంద్రశేఖర్ రూ.1.01,000 లక్షలకు పాట పాడి లడ్డూను దక్కించుకున్నారు.

వీధి కుక్కల దాడి.. బాలికకు గాయాలు



వీధి కుక్కల దాడిలో గాయపడిన బాలిక

కమలాపురం : కమలాపురం నగర పంచాయతీ పరిధిలోని 5వ వార్డు అంధుల కాలనీకి చెందిన జయన్న కుమార్తె వీధి కుక్కల దాడిలో గాయపడింది. సోమవారం రాత్రి వీధిలోని కుక్కలు కొట్లాడుకుంటూ ఒక్కసారిగా వచ్చి బాలిక పై పడి తీవ్రంగా గాయ పరిచాయి. పట్టణంలో వీధి కుక్కలు, పందులు విచ్చల విడిగా తిరుగుతున్నాయి. వాటిని తొలగించాలని పట్టణ ప్రజలు పలు మార్లు నగర పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండా పోయింది. కనీసం ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని శ్యాం, మౌలాలి, విజయ్, సురేష్ తదితరులు కోరుతున్నారు.

ఎన్‌సీసీతో నాయకత్వ లక్షణాలు

వైవీయూ: ఎన్‌సీసీతో నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ అలవడతాయని 30 ఆంధ్రా బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ ఎస్. సూర్యనారాయణమూర్తి పేర్కొన్నారు. కడప నగరం తెలుగుగంగ కాలనీలో ఈ నెల 15 నుంచి 24వ తేదీ వరకు 7వ కంబైన్డ్ ఆన్యువల్ ట్రైనింగ్ క్యాంపు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా రెండోరోజు సోమవారం ప్రారంభోత్సవ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా క్యాంపు కమాండెంట్ లెఫ్టినెంట్ కల్నల్ కిషన్‌దత్ మాట్లాడుతూ ఎన్‌సీసీతో ఉజ్వల భవిష్యత్తు సాధ్యమవుతుందన్నారు. క్రమశిక్షణ, ఐకమత్యతతో ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చని సూచించారు. శిక్షణలో భాగంగా మ్యాప్ రీడింగ్, ఫిజికల్ ట్రైనింగ్ తదితర అంశాల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఎన్‌సీసీ ఉజ్వల భవితకు బాట వేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారి పసుపుల రాజశేఖర్, సీటీఓలు పవన్, సురేందర్ నాయక్, హైదర్, పరేడ్ శిక్షకులు సుబేదార్ మేజర్ అనిల్‌కుమార్, సీఎల్‌రెడ్డి, కొండారెడ్డి, సందీప్‌సింగ్, బస్‌నెట్, కార్యాలయ సూపరింటెండెంట్ డేవిడ్, సిబ్బంది ఉమ, ప్రియ, జయసుధ, ఎన్‌సీసీ కేడెట్స్ పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

లింగాల : మండల పరిధి పార్నపల్లి గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో జూదం ఆడుతున్న జూదరులపై సోమవారం సాయంత్రం లింగాల ఎస్సై మధుసూదన్ రావు సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 12 మంది జూదరులను అదుపులోకి తీసుకున్నామని ఆయన అన్నారు. వారి వద్ద ఉన్న మూడు లక్షల 15500 నగదును స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

లింగాల : వెలిదండ్ల విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ వరదరాజులస్వామి ఫీడర్ పరిధిలో మంగళవారం ఉదయం 8 గంటల నుంచి 11 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని విద్యుత్ ఏఈ బాల సంజీవులు తెలిపారు. రోడ్డు క్రాసింగ్ విద్యుత్ స్తంభాలు మార్చుతున్న కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. కావున ప్రజలు, రైతులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలన్నారు.

నేడు మండల సమావేశం

వల్లూరు : స్థానిక మండల పరిషత్ కార్యాలయ సభా భవనంలో మంగళవారం ఉదయం 10.30 గంటలకు మండల సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీవో జయశ్రీ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ అబ్బిరెడ్డి మలేశ్వరమ్మ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో పలు అంశాలపై చర్చించడం జరుగుతుందని ఆమె పేర్కొన్నారు. కావున మండల పరిధిలోని జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు హాజరు కావాలని కోరారు. మండల స్థాయి అధికారులు తమ శాఖలకు సంబంధించి పూర్తి స్థాయి నివేదికలతో హాజరు కావాలని తెలిపారు.

ఆశ్రమానికి విరాళం

లింగాల : ఇప్పట్ల గ్రామ సమీపంలోని దీనబంధు ఆశ్రమంలో మానసిక వికలాంగులకు ఆరు నెలల పాటు ప్రతి రోజు భోజనం ఏర్పాటు చేసేందుకు వేంపల్లెకు చెందిన హరికిరణ్ రెడ్డి, అరుణ దంపతుల తరపున టీచర్ కృష్ణారెడ్డి సోమవారం ఉదయం లక్ష రూపాయలు విరాళం అందించారు. ఈ సందర్భంగా ఆశ్రమ నిర్వాహకుడు కె.జనార్ధనరెడ్డి మాట్లాడుతూ ప్రత్యేక సందర్భాలలో దాతలు భోజన ఏర్పాటుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు.

కడపలో అగ్నిప్రమాదం

కడప అర్బన్ : కడప నగరంలోని బీకేఎం స్ట్రీట్‌లో అమ్మవారిశాల వెనుకాల ఓ నివాస గృహంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో సోమవారం ఉదయం 9:30 గంటల సమయంలో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. సమాచారం అందుకున్న కడప అగ్నిమాపక కేంద్రం సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో ఇంటిలోని సామాన్లతో పాటు, వ్యాపారానికి ఉపయోగిస్తున్న జీడిపప్పు, బాదం పప్పులు, బిర్యానీ ఆకులు మొదలైనవి కాలిపోయాయి. యజమాని పి. జాషు ఫిర్యాదు మేరకు దాదాపు రూ. 50,000 ఆస్తి నష్టం జరిగినట్లు జిల్లా అగ్నిమాపక సహాయ అధికారి, కడప ఫైర్ స్టేషన్ అధికారి పి. బసివిరెడ్డి తెలియజేశారు.

రేపు చండీ హోమం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వరాలయంలో బుధవారం పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అగస్త్యేశ్వరస్వామికి, రాజరాజేశ్వరి అమ్మవారికి విశేష అభిషేకాలు, అర్చనలతోపాటు ప్రత్యేక అలంకరణ చేయనున్నారు. లోకకళ్యాణార్థం గణపతి, నవగ్రహ, చండీ హోమాలను నిర్వహిస్తున్నామని, కార్యక్రమంలో భక్తులు పాల్గొనాలని ఆయన కోరారు.

తైక్వాండో పోటీల్లో విద్యార్థుల ప్రభంజనం



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో మాస్టర్, కోచ్

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్లకు చెందిన విద్యార్థులు తైక్వాండో పోటీల్లో సత్తా చాటారని తైక్వాండో సీనియర్ మాస్టర్ సుమన్‌బాబు, ఎర్రగుంట్ల కోచ్ జె.దినేష్ తెలిపారు. కడపలో ఈ నెల 14, 15వ తేదీలలో జరిగిన తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు సోమవారం అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ పోటీలలో సీనియర్ విభాగంలో ఎస్.అమానుల్లా, డి.సుజయ్‌షాలోమ్ బంగారు పతకం, ఎస్ హసనైను వెండి పతకం సాధించారన్నారు. బాలికల విభాగంలో మహిత, రిషితలు బంగారు పతకం, ఎం.గమన్ వెండి పతకం సాధించారన్నారు. జూనియర్ విభాగంలో బాలసాయి సాత్విక్, చంద్రకాంత్‌లు బంగారు పతకం, షామీర్‌హుస్సేన్, ఎస్.యజ్ఞహిత్ రెడ్డిలు వెండి పతకం, సబ్‌జూనియర్స్ విభాగంలో పి.రెడ్డిసాకేతి, సి.వెంకటసాయి తులసినాథ్, పి.యశ్వంత్, ఎం.కార్తీక్ బంగారు పతకం సాధించారన్నారు. ఈ పోటీలలో వివిధ జిల్లాల నుంచి సుమారు 300 మంది పాల్గొన్నారని చెప్పారు.

పీడిత ప్రజల పక్షపాతి సీతారాం ఏచూరి



సీతారాం ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

జమ్మలమడుగు : సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి పీడిత ప్రజల అని ఎమ్మార్పీఎస్ ఎంఈఎస్ జిల్లా అధ్యక్షుడు పిచుక బాబు పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఎస్సీ కాలనీలో సీతారాం ఏచూరి చిత్ర పటానికి పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీతారాం ఏచూరి మరణం తీరని లోటు అని తెలిపారు. ఎస్సీ వర్గీకరణ కోసం మాదిగల పక్షాన నిలబడి మందకృష్ణ మాదిగకు సంపూర్ణ మద్దతు తెలిపారన్నారు. ఈ కార్యక్రమంలో రామన్న, చిన్నయ్య, మేకల ఆంజనేయులు, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి స్వచ్ఛతా హి సేవ ప్రారంభం

జమ్మలమడుగు : కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న స్వచ్ఛతా హి సేవ-2024 కార్యక్రమాన్ని మంగళవారం నుంచి అక్టోబర్ 2 వరకు ప్రతి వార్డు సచివాలయంలో నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ పేర్కొన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం వార్డు సచివాలయ సిబ్బందితో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛతా హి సేవ కార్యక్రమం మూడు ప్రధాన అంశాలపై నిర్వహించడం జరుగుతుందన్నారు. అదే విధంగా ఈ నెల 18న తాడిపత్రి రహదారిలో ఉన్న అన్న క్యాంటీన్‌ను ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి ప్రారంభిస్తారని పేర్కొన్నారు. ప్రతి సచివాలయం నుంచి సిబ్బంది హాజరు కావాలని ఆయన సూచించారు.

పాల్గొనాలి

లింగాల : పంచాయతీ కార్యదర్శులందరూ స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాల్లో పాల్గొనాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ లోకేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి పంచాయతీ నుంచి 20 నుండి 30 స్వచ్ఛతా హి కార్యక్రమాలు చేపట్టి, తర్వాత మాస్ క్లీనింగ్ నిర్వహించాలన్నారు. మంగళవారం అన్ని గ్రామ పంచాయతీలలో ర్యాలీ కార్యక్రమాలు నిర్వహించాలని వివరించారు.

లయోలా కళాశాల విద్యార్థుల ప్రతిభ



విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న నిర్వాహకులు

పులివెందుల టౌన్ : పట్టణంలోని లయోలా పాలిటెక్నికల్ కళాశాల(వైఎస్ఆర్ఆర్) విద్యార్థులు వ్యాస రచన, ఉపన్యాస పోటీలలో మంచి ప్రతిభ కనబరిచారు. కడప నగరంలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన వ్యాసరచన, ఉపన్యాస పోటీలలో రెండవ బహుమతి పి.రాజశ్రీ.. వ్యాసరచన పోటీలో మూడవ బహుమతిని సాయి చంద్రిక పొందారు. వీరిని కళాశాల ప్రిన్సిపల్ బ్రిట్టో, అధ్యాపకులు, సిబ్బంది సోమవారం అభినందించారు.

పెద్దదర్గాలో అన్నదానం



పెద్ద దర్గా ఆధ్వర్యంలో బార్మీ అన్నదానం

కడప కల్చరల్ : మహా ప్రవక్త మహమ్మద్ (సా.అ.వ) పవిత్ర జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం కడప నగరంలోని ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం అమీన్‌పీర్ (పెద్ద)దర్గాలో బార్మీ అన్నదానం నిర్వహించారు. దర్గా పీఠాధిపతి హజరత్ సయ్యద్‌షా ఆరీఫుల్లా హుసేనీ సాహెబ్ మార్గదర్శకత్వంలో దర్గా భక్తులు పెద్ద సంఖ్యలో తెల్లవారుజాము నుంచి దర్గా ప్రాంగణంలో అన్న ప్రసాద పంపిణీకి ఏర్పాట్లు చేశారు. నగరం నలుమూలల నుంచి పెద్ద ఎత్తున భక్తులు కార్యక్రమానికి హాజరయ్యారు. దర్గా వలంటీర్లు సహకారం అందించారు.

కడప కోటిరెడ్డిసర్కిల్ : మహా ప్రవక్త మహమ్మద్ (సా.అ.వ) జన్మదినాన్ని పురస్కరించుకుని సోమవారం కడప నగరం రెండవ గాంధీబొమ్మ వద్ద మౌలాన ఎడ్యుకేషనల్ అండ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు షేక్ అబ్దుల్ షబ్బీర్ ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం ప్రముఖులు పాల్గొన్నారు.